# ఎయిడ్స్ రహిత సమాజానికి కృషి చేయాలి



ఎదులాపురం : వైద్య విద్యార్థి శ్రీనిధికి బహుమతి అందజేస్తున్న రిమ్స్ డైరెక్టర్ రాథోడ్ జైసింగ్

ఎదులాపురం, డిసెంబర్ 1 : ఎయిడ్స్ రహిత సమాజ స్థాపనకు ప్రతి ఒక్కరూ కృషి చేయాలని డీఎల్ఎస్ఏ కార్యదర్శి క్షమాదేశ్ పాండే అన్నారు. ప్రపంచ ఎయిడ్స్ నియంత్రణ దినోత్సవాన్ని పురస్కరించుకొని శుక్రవారం జిల్లా కేంద్రంలోని డీఎంహెచ్‌వో కార్యాలయ సమావేశ మందిరంలో నిర్వహించిన కార్యక్రమానికి ఆమె హాజరయ్యారు. ఎయిడ్స్ రహిత సమజంతో పాటు బాధితులకు అండగా ఉంటామని అధికారులు, విద్యార్థులతో ప్రతిజ్ఞ చేయించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ హెచ్ఐవీ ప్రాణాంతకం కాదని, వైద్యుల సూచన మేరకు చికిత్స పొందాలన్నారు. డీఎంహెచ్‌వో రాథోడ్ నరేందర్ మాట్లాడుతూ ఎయిడ్స్‌పై ప్రజల్లో ఉన్న అపోహలు దూరం చేసినప్పుడే నిర్మూలించడం సాధ్యమవుతుందన్నారు. జిల్లాలో 2008 నుంచి 2023 సంవత్సరం వరకు 4,98,654 మంది హెచ్ఐవీ పరీక్షలు చేయించుకోగా 2,458 మందికి సోకినట్లు నిర్ధారించడం జరిగిందన్నారు. 2023 సంవత్సరం ఏప్రిల్ నుంచి అక్టోబర్ వరకు 25,181 మంది పరీక్షలు చేయించుకోగా 87 మందికి పాజిటివ్ వచ్చిందన్నారు. జిల్లాలో 988 మందికి ప్రతి నెలా రూ.2016 పింఛన్ ఇస్తున్నామన్నారు. జిల్లాలో నాలుగు హెచ్ఐవీ కౌన్సెలింగ్, టెస్టింగ్ సర్వీసెస్ కేంద్రాలు ఉన్నాయని తెలిపారు. డ్రాయింగ్ పోటీలో గెలుపొందిన డిగ్రీ కళాశాల విద్యార్థులకు బహుమతులు అందజేశారు. కార్యక్రమంలో డిప్యూటీ డీఎంహెచ్‌వో సాధన, మాస్ మీడియా అధికారి వెంకట్ రెడ్డి, కార్యాలయ సూపరింటెండెంట్లు గోపి, రవీందర్, డీపీఎంవో వామన్‌రావ్, సీహెచ్‌వో బాబాలాల్, డీపీఎం అనిల్ కుమార్, రమణాచారి, కార్యాలయ సిబ్బంది, ఆశకార్యకర్తలు, వివిధ పాఠశాల, కళాశాల విద్యార్థులు పాల్గొన్నారు.

### అవగాహన కల్పించాలి

వైద్య విద్యార్థులు క్షేత్రస్థాయి పర్యటనలో భాగంగా ప్రజలకు ఎయిడ్స్ నియత్రణపై అవగాహన కల్పించాలని రిమ్స్ డైరెక్టర్ రాథోడ్ జైసింగ్ సూచించారు. ప్రపంచ ఎయిడ్స్ నియంత్రణ దినోత్సవం సందర్భంగా రిమ్స్‌లో నిర్వహించిన కార్యక్రమానికి ఆయన హాజరై మాట్లాడారు. ప్రజలకు ఎయిడ్స్ నియంత్రణపై అవగాహన కల్పిస్తున్న ఫలితంగా వ్యాధి గ్రస్తులు సంఖ్య తగ్గుతుందన్నారు. వైద్య సేవల్లో భాగంగా వ్యాధిగ్రస్తులను గుర్తించి వారికి సరైన వైద్యం అందేలా చూడాలన్నారు. కార్యక్రమంలో భాగంగా వివిధ పోటీల్లో ప్రతిభ కనబర్చిన వైద్య విద్యార్థులకు ఆయన బహుమతులు అందజేశారు. కార్యక్రమంలో రిమ్స్ వైద్యకళాశాల ప్రిన్సిపాల్ డాక్టర్ వంజరి, నోడల్ ఆఫీసర్ డాక్టర్ సరోజ, డాక్టర్ విద్యా విల్సన్, వైద్యులు విజయలక్ష్మి, రవిశంకర్, పద్మిని, సిబ్బంది రవి, తదితరులు పాల్గొన్నారు.

### ఎయిడ్స్ నివారణకు కృషి చేయాలి

ఆదిలాబాద్ రూరల్, డిసెంబర్ 1 : ప్రపంచ ఎయిడ్స్ నివారణ దినోత్సవం సందర్భంగా ఆదిలాబాద్ రూరల్ మండలం అంకోలి ప్రభుత్వ దవాఖాన ఆవరణలో శుక్రవారం అవగాహన కార్యక్రమం నిర్వహించారు. ఎయిడ్స్ నివారణకు ప్రతి ఒక్కరూ కృషి చేయాలని పీహెచ్‌సీ డాక్టర్ సర్ఫరాజ్ అన్నారు. హెచ్ఐవీ, ఎయిడ్స్‌పై ప్రతి ఒక్కరికీ అవగాహన కలిగి ఉండాలని సూచించారు. కార్యక్రమంలో సీహెచ్‌వో వసంత, హెల్త్ సూపర్‌వైజర్ బొమ్మెత సుభాష్, తదితరులు పాల్గొన్నారు.




ఎదులాపురం : విద్యార్థులకు ప్రశంసాపత్రాలు అందజేస్తున్న డీఎల్ఎస్ఏ కార్యదర్శి, డీఎంహెచ్‌వో



ఆదిలాబాద్‌రూరల్: మాట్లాడుతున్న పీహెచ్‌సీ డాక్టర్ సర్ఫరాజ్



బాబేఝురిలో నిర్మించిన రైతువేదిక భవనం



వీధుల్లో నిర్మించిన సీసీరోడ్డు

# బాబేఝురి.. ప్రగతి బాట

- రూ. కోటి 24 లక్షలతో అభివృద్ధి పనులు
- ఇంటికే చేరుతున్న ప్రభుత్వ పథకాలు
- హర్షం వ్యక్తం చేస్తున్న గ్రామస్తులు

నార్నూర్, డిసెంబర్ 1 : రాష్ట్రం ఏర్పాటు అనంతరం పల్లెల అభివృద్ధికి సీఎం కేసీఆర్ కృషి చేస్తున్నారు. ఉమ్మడి రాష్ట్రంలో గ్రామాల అభివృద్ధిని పాలకులు పట్టించుకోలేదు. తద్వారా పల్లెలు అభివృద్ధికి ఆమడ దూరంలో నిలిచాయి. నిధులు లేక అభివృద్ధి కుంటుపడింది. బీఆర్ఎస్ ప్రభుత్వం చేపట్టిన పల్లె ప్రగతి కార్యక్రమంతో నార్నూర్ మండలంలోని బాబేఝురి గ్రామం ప్రగతి బాటలో పయనిస్తున్నది. బాబేఝురి గ్రామ పంచాయతీ పరిధిలోని చిత్తగూడ, దన్నుగూడ, మాంజ్రి గ్రామాలు ఉన్నాయి. సుమారు 220 కుటుంబాలు ఉండగా 735 మంది ఓటర్లు ఉన్నారు. 2018 నుంచి గ్రామ పంచాయతీ పరిధిలో రూ.కోటి 24 లక్షలతో అభివృద్ధి పనులు జరిగాయి. రూ.23 లక్షలతో రైతు వేదిక భవనం, రూ.13 లక్షలతో వైకుంఠధామం, రూ.2లక్షలతో సెగ్రిగేషన్ షెడ్డు, రూ.2లక్షలతో పల్లె ప్రకృతి వనం, రూ.25 లక్షలతో 1200 మీటర్ల సీసీరోడ్డు, రూ.8లక్షలతో మురుగుకాలువ నిర్మించారు. రూ.90లక్షలతో మిషన్ భగరీథ వాటర్ ట్యాంక్ నిర్మాణం, రూ.15లక్షలతో గ్రావెల్‌రోడ్డు మరమ్మతు చేశారు. రూ.9లక్షలతో ట్రాక్టర్, ట్రాలీ, వాటర్‌ట్యాంక్ కొనుగోలు చేశారు. రూ.9లక్షలతో స్ట్రీట్ లైట్లు బిగించా రు. అదేకాక 83 మందికి పింఛన్, 17 మంది కల్యాణలక్ష్మి, తొమ్మిది మందికి రైతుబీమా, 57మంది పోడుభూములకు పట్టాల లబ్ధి పొందారు. పట్టా కలిగిన ప్రతి రైతుకు రైతుబంధు పథకం కూడా వర్తిస్తున్నది.



నిర్మించిన మిషన్ భగీరథ వాటర్‌ట్యాంక్

### నీళ్ల గోస తీరింది...



గతంలో నీళ్ల కోసం రాత్రింబవళ్లు కిలో మీటర్ల దూరంలో ఉన్న బావి వద్ద నిరీక్షించాల్సి వచ్చేది. చాలా ఇబ్బందులు పడేట్లోం. బీఆర్ఎస్ ప్రభుత్వం వచ్చిన తర్వాత మిషన్‌భగీరథ నీరు అందించడంతో తాగునీటి సమస్య తీరింది. ఇంటింటికీ పుష్కలంగా నీరు వస్తున్నది.

**-కొడప లక్ష్మిబాయి, మాంజ్రి, గ్రామస్తురాలు**

### కుటుంబానికి దిక్కైన కేసీఆర్ సర్కారు..



నా భర్త ఏడాది క్రితం చనిపోయిండ్రూ. భర్త పేరు మీద 5 ఎకరాలు ఉంది. ప్రభుత్వం నా భర్త పేరుపై ప్రీమియం చెల్లించింది. అధికారులు వచ్చి వివరాలు తీసుకున్నారు. 15 రోజులలోనే నా ఖాతాలో రూ.5లక్షలు జమ చేసిండ్రూ. కుటుంబానికి పెద్దదిక్కుగా తెలంగాణ ప్రభుత్వం నిలిచింది. ప్రభుత్వ సాయం మరువలేం. **-సిడాం అనసూయబాయి, రైతుబీమా బాధితురాలు**

## 10న నేషనల్ మీన్స్ కం మెరిట్ స్కాలర్‌షిప్ పరీక్ష

ఆదిలాబాద్ రూరల్, డిసెంబర్ 1 : 2023–24 సంవత్సరానికి జరుగనున్న నేషనల్ మీన్స్ కం మెరిట్ స్కాలర్ షిప్ పరీక్ష కోసం ఆన్‌లైన్ దరఖాస్తు చేసుకున్న ఆదిలాబాద్ జిల్లా విద్యార్థులకు ఈ నెల 10వ తేదీ ఆదివారం ఉదయం 9.30 నుంచి 12.30 గంటల వరకు పరీక్ష నిర్వహించనున్నట్లు డీఈవో ప్రణీత శుక్రవారం ఒక ప్రకటనలో తెలిపారు. ఈ పరీక్షకు సంబంధించిన హాల్ టికెట్లు ప్రభుత్వ పరీక్షల సంచాలకుల కార్యాలయ వెబ్‌సైట్ https://bse.telangana.gov.in నుంచి పొందవచ్చని పేర్కొన్నారు.

## ఎమ్మెల్యే అభ్యర్థిని కలిసిన నాయకులు



నార్నూర్: ఎమ్మెల్యే అభ్యర్థి కోవలక్ష్మితో నాయకులు

నార్నూర్, డిసెంబర్ 1 : నార్నూర్ మండలానికి చెందిన ప్రజాప్రతినిధులు, నాయకులు శుక్రవారం కుమ్రంభీం జిల్లా ఆసిఫాబాద్‌లో ఆసిఫాబాద్ నియోజక వర్గ బీఆర్ఎస్ ఎమ్మెల్యే అభ్యర్థి కోవలక్ష్మిని మర్యాద పూర్వకంగా కలిశారు. కార్యక్రమంలో సర్పంచ్‌ల సంఘం రాష్ట్ర ప్రధాన కార్యదర్శి బానోత్ గజానంద్‌నాయక్, భీంపూర్ ఎంపీటీసీ జాదవ్ రేణుక–దిలీప్, మండలాధ్యక్షుడు మెస్రం హన్మంత్‌రావ్, జాదవ్ ప్రకాశ్, ఉత్తమ్, ఫిరోజ్‌ఖాన్, షేక్ దాదేఅలీ, కుమ్ర రాహుల్, బషీర్, మహ్మద్‌ఖురేషి పాల్గొన్నారు.

## మండల సర్వసభ్య సమావేశం వాయిదా



మాట్లాడుతున్న ఎంపీపీ పంద్ర జైవంత్‌రావ్

ఉట్నూర్, డిసెంబర్ 1: మండల పరిషత్ కార్యాలయంలో శుక్రవారం నిర్వహించిన మండల సర్వసభ్య సమావేశం వాయిదా వేసినట్లు ఎంపీపీ పంద్ర జైవంత్‌రావ్ తెలిపారు. అధికారులు అసెంబ్లీ ఎన్నికల విధులు నిర్వహించి ప్రత్యేక సెలవులలో ఉన్నందున సమావేశాన్ని మరోసారి నిర్ణయించి ప్రకటిస్తామని పేర్కొన్నారు. కార్యక్రమంలో వైస్ ఎంపీపీ బాలాజీ, ఎంపీడీవో తిరుమల, సర్పంచ్‌లు, ఎంపీటీసీలు పాల్గొన్నారు.

## బాధిత కుటుంబానికి పరామర్శ

ఇచ్చోడ, డిసెంబర్ 1 : సిరికొండ మండలం సుంకిడి గ్రామానికి చెందిన సిడాం మహాదు కుమారుడు ఇటీవల మృతి చెందాడు. బాధిత కుటుంబ సభ్యులను శుక్రవారం రాష్ట్ర ఎస్సీ, ఎస్టీ కమిషన్ సభ్యురాలు కుమ్రం నీలాదేవి పరామర్శించారు. మృతికి గల కారణాలు అడిగి తెలుసుకున్నారు. ఆమె వెంట మాజీ ఉపసర్పంచ్ ఆత్రం జల్పత్, రఘురాం, లక్ష్మణ్‌రావ్, నాయకులు ఉన్నారు.